

# ఎందుకు?

ఎ.కృష్ణ

సుశీలకా పేరు వాళ్ళ మేనత్త పెట్టింది.

పుట్టినపుడు తెల్లగా, బొద్దుగా సిరి మల్లెపూల చెండులా వుందని ముచ్చట పడి "అన్నాయ్! ఎప్పటికైనా యిది నా కోడలేరా" అని ఒక స్టేటుమెంటులాంటి దిచ్చి ఏరి కోరి ఆ పిల్లకి 'సుశీల'ని నామ కరణం చేసింది.

సుశీలకు పదిహేనేళ్ళు వచ్చేవరకు యింటా బయటా ఆ పిల్ల గోపాలం పెళ్ళామని చాలా గాఢంగా అభిప్రాయ పడ్డారు. కానీ గోపాలం ఎవరూ వూహించ లేనంత ప్రయోజకుడైపోయి, స్కూలు ఫైనలు పాసై, సెకండరీగ్రేడు టీచర్ ట్రైనింగు కూడా పూర్తిచేసి, వున్న వూళ్ళోనే టీచరుగా స్థిరపడ్డాక సుశీల మేనత్త, ఆవిడ మొగుడుకూడా "సుశీలని కోడలుగా చేసుకోవటమా!" అని సందిగ్ధ పడ్డారు.

చిన్నప్పటి నుండీ అనుకున్న సంబంధం. కట్నమడిగితే బావుంటుందా అని తనలో తనే చాలా మధనపడింది సుశీల మేనత్త. బయట సంబంధాలు చేసు

కుంటే ఐదారువేల కట్నం వస్తున్నపుడు. అవి వదులుకుని బుద్ధి తక్కువగా నోరు జారి అన్న మాటలకు అంత విలువ ఎందుకివ్వాలో ఆవిడ మొగుడికి బుర్ర బద్దలు కొట్టుకున్నా అర్థం కాలేదు "మన కేమన్నా యియ్యాలా! పెట్టాలా? తన మేనల్లుడు. తనిచ్చుకుంటాడు. ఇయ్యమని నేను యేరే అడగాలేంది?" అని కూడా అన్నాడు చాలా లౌక్యంగా వూరివాళ్ళతో.

కానీ మరో రెండేళ్ళకి సుశీల తండ్రి. ఆయన పేరు నరసయ్య పరిస్థితి తారు మారై పొలమంతా పూర్తిగా అమ్మేసు కుని, కరణంగారి పొలం కౌలుకు తీసు కుని గుట్టుగా సంసారం లాక్కురావడం ప్రారంభించడంతో బయటవాళ్ళ సంగ తేమోగానీ సుశీల మేనత్త ఆవిడ మొగుడు యిహ పెళ్ళికి సంబంధించిన మాటలు మాటాడ్డం మానేశారు ఎవరైనా "కొడుక్కి పెళ్ళెప్పుడు చేస్తావు కాంతమ్మా?" అంటే ఆవిడ గుంభనగా నవ్వి "చిన్న వెధవ! వాడి కిప్పుడు పెళ్ళేవిటమ్మా! ఈ రోజుల్లో ఆడ ముండలుకూడా పాతికేళ్ళు వస్తేనేగానీ పెళ్ళిపీట ఎక్కటం లేదు" అనేది.

ఆవిడ వుద్దేశం గ్రహించాక వూరి వాళ్ళందరూ నరసయ్య కూతురికి ఎలా పెళ్ళి చేస్తాడా?అని పరమ కుతూహలపడి అతను అడుగు బయటకు పెడితే చాలు "ఏం నరసయ్యా! పిల్లదానికి పెళ్ళెపుడు చేస్తావ్?" అనడిగేవాళ్ళు. ఆ భారమేదో తమ భుజస్కంధాలమీద వున్నట్టు. సరిగ్గా అలాంటి విషమ పరిస్థితిలో కర ణానికి దొరికిపోయాడు నరసయ్య. రెండేళ్ళ క్రితం భార్య వ్యాధి నయం చేయించుకునేందుకు పుచ్చుకున్న మూడు వేలూ ఉన్నపళానా కక్కుతావా? ఛస్తావా? లేదా నీ కూతుర్ని నా కొడుక్కిస్తావా అని పీకలమీద కూర్చున్నాడు కరణం.

కరణం వయసులో ఉన్నపుడు పట్నంలోని ప్రతి సందులోనూ అందాన్ని కొనుక్కున్నందుకు ఫలితంగా పుట్టాడు వెంకటేశం. వాడు వెర్రిబాగులవాడు అని తండ్రీ, అమాయకుడమ్మా అని తల్లి, "పిచ్చివాడు"అని వూళ్ళోవాళ్ళుఅంటారు. పెళ్ళిచేస్తే కొడుకు పిచ్చి తగ్గుతుందేమో అని కరణం ఆశ. ఈ ప్రయోగాలకి పరికరంగా ఆయన సుశీలను వాడదలచు కున్నాడు. బుద్ధివున్న వాడెవడూ తన పుత్రరత్నానికి పిల్లనివ్వడు గనుక. నర సయ్య సమయానికి తనచేతిలో చిక్కాడు గనుక

ఆ విషయం వినగానే సుశీల తల్లి భోరున ఏడవలేదు. తండ్రి కరణం బుర్ర బద్దలు కొడతానని ఆవేశపడిపోలేదు. కరణంలాంటి గొప్పింటి సంబంధంచేస్తే ఆడపడుచుని ఎంత చులకనగా చూడ వచ్చో తలచుకొని మురిసిపోయింది తల్లి. ఈ పెళ్ళిచేస్తే పిల్లకి కూడుకి, గుడ్డకీ, నగలకీ లోటుండదు. తనకీ వడ్డీలు కట్టే బాధా, అప్పుతీర్చే బాధా వుండదు ముఖ్యంగా పెళ్ళెప్పుడు చేస్తావని వేధించే పెద్దమనుషుల బాధ వుండదు అయినా కుర్రవాడు. ముసలివాడా, ముతకవాడా! కాస్త వెర్రిబాగులవాడు. అంతేగా" అను కున్నాడు తండ్రి తన నోటితో తను పిచ్చి వాడు అని ఎన్నోసార్లు హేళన చేసిన

కుర్రవాడిని తలచుకుని.

సుశీల మాత్రం చాలా బాధపడింది అయితే ఏడుస్తూ కూర్చోలేదామె కొద్దిగా ధైర్యాన్ని ప్రదర్శించింది గోపాలందగ్గర కెళ్ళి "మనిద్దరం ఎక్కడికైనా వెళ్ళి పోదాం బావా!" అంది. జీవితాన్ని కథల్లో చదివీ, తెలుగు సినిమాల్లో చూసీ అయితే గోపాలం ప్రపంచం తెలిసినవాడు. తమ పెళ్ళివల్ల తనకూ, తన కుటుంబానికీ, ఆమెకూ, ఆమె కుటుంబానికి వచ్చే కష్ట నిష్ఠూరాలు వివరించి, "నువ్వు దయ చూడాలేగానీ నే నెప్పుడూ నీవాడినే. పవిత్ర ప్రేమకి పెళ్ళి ససేమిరా అవసరం లేదు అసలు పెళ్ళి పవిత్ర ప్రేమను నిలువునా ఖూనీ చేస్తుంది కూడాను. అయినా ఆ వెర్రివాడితో నువ్వేం సుఖ పడతావో నాకు తెలీదా" అన్నాడు భుజం మీద చేయివేస్తూ. సుశీల విదిలించుకు వచ్చేసింది.

సుశీలకి వెంకటేశంతో పెళ్ళయ్యాక తెలిసింది అతను ఓ మాదిరి వెర్రివాడు కాదని, ఎల్లప్పుడూ ఇనుప గొలుసులతో మంచానికి కట్టి పడెయ్యవలసినంత పిచ్చి వాడని కరణం ప్రతి మధ్యాహ్నమూ ఆమెకు భగవద్గీత చదివి వినిపించేవాడు. ఆయన భార్య సుశీలకి పతివ్రతల కథలు, చన్నీళ్ళ స్నానంవల్ల కలిగే ఉపయోగాలు, ఆత్మనిగ్రహం గురించీ గంటల తరబడీ బోధించేది.

అయినా పెళ్ళయిన ఆరు నెలలకి సుశీల పక్కింటి శ్రీధరంతో లేచి పోయింది.

రాత్రి ముడుచుకుని వున్న మొగ్గలు తెల్లవారగానే విచ్చుకుని పూలవుతాయంటే ఎవరూ ఆశ్చర్యపడరు!

తేనెవున్న పూలమీద తుమ్మెదలు వాలతాయన్నా ఎవరూ ఆశ్చర్యపడరు!!

గేదెలు పాలిస్తాయన్నా, కుక్క మొరుగుతుందన్నా, క్రొత్త చెప్పులు కరుస్తాయన్నా, అగ్గిపుల్ల మండుతుం దన్నా, పాలు పొంగుతాయన్నా ఒక్కరూ ఆశ్చర్యపడరు!!!

అంతెందుకూ? ఇప్పటికీ కరణం అర్ధ రాత్రి మంగి దగ్గరకు వెళ్తాడని తెలిసీ ఆశ్చర్యపోరు ఆ వూరివాళ్ళు. ఆయన రసికతకి ముసిముసిగా నవ్వు కుంటారు.

కానీ ఇరవై ఏళ్ళు నిండని సుశీల తండ్రి బాధ్యతారాహిత్యానికి, తల్లి అతి శయానికి, కరణం గొప్పకీ, క్రూరత్వా నికీ బలై, వెర్రివాడికి ఇల్లాలై, ఆ బ్రతు కుని భరించలేక శ్రీధరంతో వెళ్ళిపోతే మాత్రం పరమ ఆశ్చర్యపడ్డారు. "ఎంత నీలుగుడు దీనికి, ఇంత సంపదను కాల దన్నుకుపోతుందా?ఆ ముచ్చటెన్నాళ్ళులే" అని ఈసడించుకున్నారు. "అసలు ఇదేం మాయరోగం దానికి? హాయిగా కరణం గారి నీడన పడివుండక ఏం చూసుకు ఆ శ్రీధరంగాడితో లేచిపోయింది" అని పదే పదే ఆశ్చర్యపోయారు.

మీరు చెప్పండి మాష్టారూ!

ఇందులో వాళ్ళని అంతగా ఆశ్చర్య పరిచిన దేమిటి?

ఇరవై ఏళ్ళ వ్యక్తికి స్వభావసిద్ధమైన కోరిక వుండటమా? లేక చన్నీళ్ళ స్నానాలు, భగవద్గీతా పారాయణాలు ఆ కోరికను చంపలేకపోవడమా? □